# కొత్త నీరొచ్చింది

బొజ్జా తారకం

"అసలు ఆ ఊళ్ళోకి ఎవడో కుర్రాడొచ్చాడని తెలిసినప్పుడే జాగ్రత్తపడాల్సింది- ఇపుడనుకొని ఏం ప్రయోజనం- వాడు చెయ్యాల్సిందంతా చేసే పోయాడు వెధవ, వాడిక్కడడుగుపెట్టకుండా పోతే గొడవలేక పోయేది- వాడొచ్చి పెడగొట్టాడు వీళ్ళను. ఏం మాయ చేశాడో ఏమో.... చిల్లర వెధవలంతా వాడిచుట్టు చేరి సంఘం కట్టారు. ఏ వెధవని పిలిచినా అదే మాట- మా సంగాన్నడగాలండి అని. వెధవలకి ఎక్కడొచ్చిందో ఈ ఐకమత్యం? మరి యిహ యిపుడు కూడా మనం ఏమీ చెయ్యక పోతే మనం యీ ఊళ్ళో యిహ వుండనక్కరలేదు" అన్నాడు కరణం సర్పంచ్ దగ్గరకొచ్చి.

ఆ ఊరికి సర్పంచే పెద్ద భూస్వామి. అతని మాటకు ఎదురనేది ఆ ఊళ్ళో లేదు- అపుడపుడూ అక్కడక్కడా వున్నా డబ్బు ముందు, అధికారం ముందు నిలబడ లేకపోయాయి- ఆ విషయంలో అతనికి కరణం మద్దతు పూర్తిగావుంది. ఆమాటకొస్తే అతనంత పెద్ద భూస్వామి అవడానికి కరణం చేతి సహాయం చాలావరకు వుంది- సరి హద్దులు చెరిగిపోడాలూ, సర్వేనెంబర్లు కిందుమీదులూ, స్వాధీనపు రాతలూ కోతలూ అన్నీ అతన్ని భూస్వామిని చేశాయి- దానికి ప్రతిఫలం కరణానికి ఎప్పుడూ ముడుతూనే వున్నది.

"ఏమయింది పంతులూ, ఏంటి ముంచుకొచ్చింది?" అనడిగాడు సర్పంచ్ నోట్లోంచి చుట్టతీసి ఉమ్మేస్తూ.

"ఏంటవడవేంటి? మీరలా చుట్ట కాలుస్తూ కూర్చోండి, అవతల వాళ్ళు ఊరు కాల్చుకుంటూ వస్తారు" అన్నాడు కరణం.

"ఎవడయ్యా ఊరు కాల్చే మొనగాడు?"

"ఒకడయితే యిబ్బంది లేకపోయేది, మొత్తం ఊరు ఊరంతా ఏకమయింది ఒక రెడ్లు తప్ప."

"ఏం చేస్తున్నారేంటి ఏకమయ్యి?"

"చూస్తూ వుండండి తెలుస్తుంది- ఈపేళ చెరువు మాదంటారు, రేపు చేను మాదంటారు."

606

"చెరువు మాదనడం ఏంటి?"

"చెరువు గవర్నమెంటుది, దాని సర్వే నెంబరు ఏసివ్వండి, దాంట్లో సర్పంచ్‌కి అధికారం లేదు– ఆ నీరు ఊరందరికీ చెందాలి, ఆ చెరువులో చేపలు ఊరిమీద పట్టుకోవాలి– అని ఇందాక నలుగురు మొనగాళ్ళొచ్చారండి నా దగ్గరికి" అన్నాడు కరణం.

అప్పటికిగాని సర్పంచ్‌కి అర్థంకాలేదు– తన అధికారాన్ని ప్రశ్నించే సమయం వచ్చిందని.

వాళ్ళకు యింతవరకూ లేని బుద్ధి యిపుడెలా వచ్చింది? ఆ చెరువుని తన తండ్రి దగ్గరనుంచీ తామే వాడుకుంటున్నారు– ప్రతి ఏడూ చేపలు పట్టించి అమ్మించి ఆ డబ్బును తామే ఉంచుకొనేవారు. ఎవరూ ఎప్పుడూ ఏమీ అనలేదు, ఈవేళ చెరువు గవర్నమెంటు దనే మాట ఎలా వచ్చింది అనే ఆలోచనలో పడ్డాడు సర్పంచ్ చుట్ట ఆరిపోయిన సంగతి చూసుకోనేలేదు.

"సందేహం లేదు.... వాడే.... ఆ కుర్రవెధవ నేర్పివుంటాడివన్నీ"– అసలు వాడొచ్చినట్టు చాల రోజుల వరకూ తనకు తెలియనే లేదు– మాలవాళ్ళిళ్ళల్లో వుంటే ఎవడికేంతెలుస్తుంది– నెమ్మదిగా ఊరంతా రాత్రులు మాలపేటలోకి వెళ్తొండడంతో కొంత తెలిసింది– అప్పటికే చిల్లర కులాలు సంఘం కట్టడం, ఏవేవో మాటలు నేర్చు కోవడం, పాటలు పాడడం జరిగిపోయింది– అప్పుడు జాగ్రత్తపడినా యింతవరకూ వచ్చేదికాదు,

"మరిప్పుడేం చేయమంటావ్?" అడిగాడు సర్పంచ్.

"చెరువులో వాళ్ళు చేపలు పడతారట– చూస్తూ వుండండి."

"పోలీసుల్ని పిలిపించి నాలుగు తన్నిస్తే పోద్ది గదయ్యా– ఏవిటి దీనికంత ఆలోసిస్తావ్.... వెధవలు నక్సలైట్లు అని రిపోర్ట్ రాసేస్తే జైల్లో తోలేస్తారు– తిక్క కుదురుతుంది కొడుకులికి" అన్నాడు సర్పంచ్

ఇద్దరూ ఆలోచించి రిపోర్ట్ రాశారు.

ఎవడో నక్సలైట్ వచ్చి ఊరిని పాడుచేస్తున్నాడని, సంఘం కట్టి సర్పంచ్ ఆస్తిని దోడాకోవనికి ప్రయత్నాలు జేస్తున్నారని, రాత్రి మాలపేటలో రోళ్ళలో మందులు నూరుతున్నారని వ్రాసి రిపోర్ట్ పంపించారు.

పోలీసులు వచ్చి మిగతా పని చేసుకుపోతారులే అని ధైర్యంలో ఆ రాత్రి యిద్దరూ హాయిగా నిద్రపోయారు.

607

మర్నాడు ఉదయం చెరువు దగ్గర కోలాహలంగా వుంది– ఆడామగా పిల్లా జెల్లా అందరూ చెరువుచుట్టూ గట్టుమీద చేరారు– చేపలు పట్టుకొనే వాళ్ళు చెరువులో దిగారు– వాళ్ళకు సాయం కొందరు కుర్రాళ్ళు దిగారు– పైన గట్టుమీద మరికొందరు కుర్రాళ్ళు చప్పట్లు వేసుకుంటూ హుషారుగా పాటలు పాడుతున్నారు– పిల్లలు చేపల్ని చూసి, చప్పట్లు విని గెంతుతున్నారు– ఆడవాళ్ళు ఏమవుతుందా అని భయం భయంగా చూస్తున్నారు. జీప్‌లో పోలీసులు రానే వచ్చారు– వచ్చీ రావడంతోనే అక్కడ వున్న జనాన్ని లాఠీలతో కొట్టడం మొదలుపెట్టారు– ఆడామగా తేడాలేకుండా ఏడుపులు.... పరుగులు.... తొక్కులాటలు....

చెరువులో ఉన్నవాళ్ళను పైకి రమ్మంటున్నారు–

ఆడవాళ్ళు పిల్లలు యిళ్ళకు పారిపోయారు–

మగాళ్ళ నందరినీ చిత్తుగా బాది స్టేషన్‌కి నడవమన్నారు.

పట్టుకున్న చేపల్ని జీప్‌లోకి ఎక్కించారు.

"ఎవడ్రా నక్సలైట్ మీలో– రమ్మనండి బైటికి" అని అరిచాడు ఎస్. ఐ. బండబూతులు తిడుతూ, "బతకాలని లేదేంట్రా, నక్సలైట్‌ని ఊళ్ళో పెట్టుకున్నారు– సర్పంచ్‌కి ఎవరైనా ఎదురుతిరిగారంటే, ఆయన ఆస్తికి నష్టం కలిగించారంటే కాల్చేస్తాను నా కొడకల్లారా" అని కర్రతో దగ్గరున్న వాళ్ళని టపాటపామని కొట్టాడు.

"ఇది గవర్నమెంటు చెరువండి" అని ఎవరో కుర్రాడంటే–

"ఏంట్రా కూస్తున్నావ్? మళ్ళీ కుయ్...." అన్నాడు ఎస్. ఐ.

"అది గవర్నమెంటుదండి– మేం తహశీలాఫీసులో తెలుసుకున్నాం– అడగండి కర్నంగోర్ని" అన్నాడో పెద్దమనిషి.

"ఎవడన్నాడు గవర్నమెంటుదని? సర్పంచ్‌గారి తండ్రి దగ్గర్నుంచి వారి భుక్తంలోనే వున్నది" అన్నాడు కరణం హెడ్ వెనకాల నుంచి.

"మరి అరి తండ్రిగారి నుంచి ఆరే ఆడుకుంటుంటే మరి యియ్యాల్నుంచి మేం మొదలెడితే రేపు మా కొడుకులు ఆడుకుంటారండి" అన్నాడింకో పెద్దమనిషి.

"ఏంట్రా మీరు కర్నంగార్నే ఎదిరించి మాట్లాడతారా?" అని లాఠీతో రెండు వేశాడిద్దరినీ.

"నడండి, నడండి" అంటూ ఎస్. ఐ. గారి ఆజ్ఞమీద అందరినీ స్టేషన్‌కి నడిపించారు. పశువుల్ని తోలుకెళ్ళినట్టు కొట్టుకుంటూ స్టేషన్‌కి తీసుకెళ్ళి మళ్ళీ వరసగా

608

ఒక్కొక్కణ్ణే పిలిచి "నక్సలైటుల్లో చేరార్రా" అని లాఠీలతో కొడుతూ "ఏడ్రా అదు? ఎక్కడున్నాడు? ఎలాగుంటాడు? చెప్పండి" అంటూ యిష్టమొచ్చినట్టు బాదారు.

కరణం చెప్పిన కొందరు కుర్రాళ్ళని లోపలికి పిలిచి జుట్టుపట్టుకొని గట్టిగా పీకి, పడుకోబెట్టి నలుగురైదుగురు కానిస్టేబుల్స్ ఎక్కితొక్కి కాళ్ళమీద లాఠీలతో విపరీతంగా కొట్టారు.

వాళ్ళను మాత్రం మూడు నాలుగు రోజులు అలానే కొట్టుతూ స్టేషన్‌లోనే వుంచి విడిచిపెట్టారు— అదయినా మళ్ళీ అదే సర్పంచ్, కరణం వచ్చి "మా వాళ్ళని విడిచి పెట్టండి, వాడెవడో వెధవ మాటలు విని వీళ్ళిలా చేశారుగాని ఎప్పుడూ యిలా చేసేవారు కాదండీ, మంచోళ్ళే.... యిక చెయ్యరు" అని జామీను యిచ్చిన మీదటే వదిలారు.

ఇదంతా నాటకమని ఒకరిద్దరు కుర్రాళ్ళు గ్రహించారు.

ఈ సంగతి గ్రామంలో పెద్ద మార్పు తెచ్చింది—

భయాన్ని కలిగించింది పెద్దవాళ్ళలో—

పట్టుదల పెరిగింది కుర్రాళ్ళలో.

అయితే కొన్ని రోజులు ఎవరూ మాట్లాడుకోలేక పోయారు— పాటలు మూత పడిపోయాయి.

ఇది గమనించిన సర్పంచ్, కరణం బ్రహ్మానందపడ్డారు— 'ఇక మళ్ళీ లేవలేరు వెధవలు, ఇక మన జోలికెవడూ రాడు' అని చంక లెగరేసుకున్నారు.

ఊరి కెవడూ రావడం లేదని తెలుసుకున్నాక ఇంకా సంబరపడ్డారు— ఇక యీ నక్సలైట్ బెడద పోయిందని, ఎందుకయినా మంచిదని ఐస్.ఐ. గారితో మాట్లాడి నెలకోసారి యీ చిల్లర వెధవల్నందరినీ స్టేషన్‌కి పిలిపించి జాగ్రత్తగా వుండండని బెదిరింపిస్తున్నారు. దాంతో మరీ ధైర్యమొచ్చింది. ఇక మనల్ని ఎదిరించే వాడు పుట్టడని తీర్మానించుకున్నారు సర్పంచ్ కరణాలు.

ఒక సంవత్సరం గడిచిపోయింది....

చెరువులో చేపల్ని సర్పంచ్ పట్టించాడు.

కొన్ని పోలీసుల కందాయి, మరీ పెద్దవి ఎస్. ఐ. గారికి....

ఊళ్ళో ఎవరూ ముందుకు రాలేదు— కిమ్మనకుండా ఊరుకున్నారు.

"ఇంకెక్కడ లేస్తారు? చావు దెబ్బలు తిన్నాక" అన్నాడు సర్పంచ్ ఆ సాయంత్రం కరణం గారితో.

ఆ చెరువుని ఆక్రమించుకున్నట్టే దాన్ని ఆనుకొనివున్న యిరవై ఎకరాల గవర్నమెంటు భూమినీ ఆక్రమించుకున్నాడు సర్పంచ్. ఎన్నో ఏళ్ళనుంచి పండించుకుంటున్నాడు.

యధాప్రకారం చేలల్లో నీళ్ళు పెట్టించి దుక్కికి సిద్ధం చేయిస్తున్నాడు సర్పంచ్.

మృగశిర వచ్చింది.

గత ఏడాది అంతా ఎక్కడా ఆ కుర్ర పెధవ వచ్చినట్టులేదు. ఆ కొత్తపాటలూ వినపడలేదు. 'ఇంక వీళ్ళకు నేర్పేవాడెవడూ రాడు, ఇక వీళ్ళేమీ చేయలేరు' అనే ధైర్యంతో వున్నాడు సర్పంచ్.

ముహూర్తంచూసి కొబ్బరికాయ కొట్టి దున్నడం మొదలు పెట్టించాడు సర్పంచ్.

సరిగ్గా అదే ముహూర్తానికి ఊరుఊరంతా లేచివచ్చినట్లు మగాళ్ళంతా నాగళ్ళతో చేను దగ్గరికి వస్తున్నారు. కొత్త ఊడ్పు పాటలు పాడుకుంటూ ఆ వెనక ఆడవాళ్ళు.

పెద్ద నీటికెరటం తనమీద పడుతున్నట్టు భయపడి పక్కకు జరిగాడు సర్పంచ్.

మగాళ్ళంతా నాగళ్ళతో చేలోకి దిగారు.

"ఆపండ్రాళ్ళని....ఆపండి...." అని తన కూలోళ్ళని కేకలేస్తున్నాడు సర్పంచ్- "ఎక్కడికిరా ?" అని ఊరివాళ్ళను అడుగుతున్నాడు.

"ఇది గవర్నమెంటు భూమి.... అడ్డంవస్తే ఊరుకొనేది లేదు" అని దున్నటం మొదలుపెట్టారు.

సర్పంచ్ కూలివాళ్లు ఏమీ చెయ్యలేక నిలబడి పోయారు. కుర్రాళ్లు వాళ్లతో ఏవో చెబుతున్నారు. కొంతసేపటికి వాళ్లూ జనంలో కలిసిపోయారు.

సర్పంచ్‌చుట్టూ కుర్రాళ్లు చప్పట్లుకొడుతూ హుషారుగా పాటలుపాడుతున్నారు.

వాళ్లనీ తానుతెచ్చిన కూలాళ్లనీ నానా బూతులుతిడుతూ యింక ఏమీచెయ్యలేక 'మళ్లీ నక్సలైట్లు వచ్చారని' పోలీసులకు చెప్పడానికి యింటిముఖాన పరుగుతీశాడు సర్పంచ్- ఆడవాళ్లు నవ్వుతున్నారు.

గొంతులన్నీకలిసి కొత్తపాటలు పాడుతున్నాయి.
నాగళ్లు కొత్తదుక్కి దున్నుతున్నాయి.
చేలోకి కొత్తనీరు రఁయ్‌మంటూ వస్తున్నది....

610